సబ్సిడీ టార్పాలిన్లు ఏవి?

- రైతులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు


మానవపాడులో టార్పాలిన్లు లేక వర్షానికి తడిసిన మిరప

మానవపాడు: రాష్ట్ర ఏర్పాటు తర్వాత రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ వ్యవసాయ పరికరాలు, టార్పాలిన్లు పంపిణీ చేయడం లేదు. ధాన్యం ఆరబెట్టేందుకు, అకాల వర్షాల నుంచి కాపాడుకునేందుకు టార్పాలిన్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఇటీవల అకాల వర్షాలతో అన్నదాతలు అతలాకుతలం అయ్యారు. యాసంగి కోతల సమయంలో వాతావరణంలో వచ్చిన పెను మార్పులు రైతుల్లో కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. కేంద్రాల్లో ధాన్యం ఆరబెట్టుకునే సమయంలోనే అకాల వర్షాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిరప, వరి, మొక్కజొన్న తదితర పంటలను కల్లాల్లో ఉంచితే అకాల వర్షాలతో రైతులు పంట తడిసి తీవ్రంగా నష్టపోయారు. దీంతో టార్పాలిన్లు లేక అవస్థలు పడుతూ రైతులు లబోదిబోమంటున్నారు. టార్పాలిన్ల పంపిణీ చేయకపోవడంతో రైతులు నష్టపోవాల్సిన దుస్థితి నెలకొంది. సబ్సిడీ కూడా ప్రభుత్వం ఎత్తేయడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అలంపూర్ నియోజకవర్గంలోని 8 మండలాల్లో దాదాపు 124 గ్రామ పంచాయతీలు ఉండగా ఆయా గ్రామాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకొని ప్రభుత్వానికి నివేదికలను పంపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నివేదికలు పంపుతాం..

ప్రభుత్వం నుంచి సబ్సిడీపై టార్పాలిన్లు రాలేదు. ప్రభుత్వానికి నివేదికలు పంపుతాం. ప్రభుత్వం సరఫరా చేస్తే రైతులకు అందజేస్తాం.

– సక్రియానాయక్, ఏడీఏ, అలంపూర్

టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి..



ధాన్యం ఆరబెట్టే సమయంలో వర్షాలు వస్తే టార్పాలిన్లు అందుబాటులో ఉండటం లేదు. ప్రస్తుతం అకాల వర్షాలతో ధాన్యం తడిసి నష్టపోయాం. మొక్కజొన్న, మిరప పంటలను ఆరబెట్టేందుకు టార్పాలిన్లు లేక అవస్థలు పడ్డాం. ప్రభుత్వం రైతుల కోసం సబ్సిడీ ద్వారా టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలి.

– గోపాల్, రైతు, గోకులపాడు

ఒక్క టార్పాలిన్‌కు రూ.5 వేలు..



పండించిన పంటలను వర్షాల నుంచి కాపాడుకునేందుకు ఒక్క టార్పాలిన్ రూ.5 వేలు ఖర్చు అవుతోంది. గతంలో టార్పాలిన్లు సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేసేది. ప్రస్తుతం సబ్సిడీని ఎత్తేసింది. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో టార్పాలిన్లను సబ్సిడీపై అందించాలి.

– శ్రీకాంత్‌రెడ్డి, రైతు మానవపాడు

రైతుబంధుతో మంగళం..



అలంపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు వరి, మొక్కజొన్న, జొన్న, మిరప, కందులు తదితర పంటలు అధికంగా సాగు చేస్తారు. రైతు పండించిన పంటను కలాల్లో ఆరబెట్టుందుకు టార్పలిన్లు లేక అవస్థలు పడుతున్నారు. రైతుబంధు పథకం కోసం నిధులు ఖర్చు పెట్టడంతో సబ్సిడీలు ఎత్తేశారు. వ్యవసాయానికి సంబంధించి సబ్సిడీలను ప్రవేశపెట్టాలి.

– పురేంధర్‌రెడ్డి, రైతు మానవపాడు.

క్లుప్తంగా

వారాంతపు సంత కిటకిట



గట్టు: వారాంతపు సంత పల్లె జనాలతో కిటకిటలాడింది. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన వారాంతపు సంత కొనుగోలుదారులతో కిక్కిరిసింది. ఏరువాక పౌర్ణమి సందర్భంగా ముంగారి సేద్యం పనులకు ముందు రైతులు నిర్వహించే తొలి పండుగ కావడంతో నిత్యావసర సరుకులు, కూరగాయలను కొనుగోలు చేసేందుకు రైతులు అధిక సంఖ్యలో రైతులు తరలివచ్చారు. గట్టు, సల్కాపురం, జోకన్‌గట్టు, రాయాపురం, తారాపురం, గంగిమాన్‌దొడ్డి గ్రామాలకు చెందిన రైతుల సందడి కనిపించింది.

ఆకట్టుకున్న భజన పాటలు

గట్టు: మండల కేంద్రంలోని కొర్వంజమ్మవ్వ దేవాలయం దగ్గర మంగళవారం రాత్రి నిర్వహించిన భజన కార్యక్రమం గ్రామస్తులను ఆకట్టుకుంది. మండల కేంద్రానికి చెందిన నరేష్ బృందం భక్తి గీతాలు ఆలపించారు. కొర్వంజమ్మవ్వ నూతన విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించి, రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు అమ్మవారి ఊరేగింపును నిర్వహించారు. మధురాతిమధురం కొర్వంజమ్మవ్వ చరితం, ఒట్టిది ఈ మాయదేహం–గుట్టు తెలుసుకొండయా...అంటూ గట్టు నరేష్ ఆలపించిన పాటలు గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మంత్రాలయం మండలం పుచ్చమరికి చెందిన నర్సింహులు, మాలపల్లికి చెందిన ఆంజనేయులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇండ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోవాలి

కేటీదొడ్డి: ఇండ్లు లేని పేదలు స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని బుధవారం తహసీల్దార్ సుందర్ రాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పాగుంట, గువ్వలదిన్నె, ఎర్సందొడ్డి, కొండాపురం గ్రామాల ప్రజలు పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. గురువారం నుంచి నుంచి 6వ తేదీ వరకు గడువు ఉందని పేర్కొన్నారు. ఆధార్, రేషన్ కార్డు, ఎస్‌కే డాటా, అడ్రస్‌ప్రూఫ్, పాస్‌ఫొటోలు, గతంలో ఇచ్చిన పట్టా సర్టిఫికెట్ అందజేయాలని కోరారు.

డ్రిప్ పరికరాలు అందక రైతుల అవస్థలు

ధరూరు: వ్యవసాయ రంగంలో అవసరమైన డ్రిప్ పరికరాలు పంపిణీ చేయాలని మండల రైతులు కోరుతున్నారు. కొన్నేళ్లుగా రైతులకు డ్రిప్ పైపులు అందించడం లేదని, దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరలకు కొనుగోలు చేసి పొలాల్లో నీళ్లు పారించుకుంటున్నామని రైతులు వాపోయారు. పత్తి పంటకు అవసరమైన డ్రిప్ పరికరాలు సబ్సిడీపై అందించాలని పేర్కొన్నారు. అందేవిధంగా సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు, పరికరాలు పంపిణీ చేయాలని మండల రైతులు కోరుతున్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

రాజోళి: వైకుంఠ నారాయణ స్వామి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు చేశారు. అనంతరం ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠ, గరుడ వాహన సేవ నిర్వహించారు. అనంతరం రాత్రి హనుమంత వాహన సేవ భక్తి శ్రద్ధలతో కొనసాగింది. స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఘనంగా గ్రామ దేవతల ఉత్సవాలు

మానవపాడు: మండలంలోని అమరవాయిలో బుధవారం దేవర, గ్రామ దేవతల ఉత్సవాలు గ్రామపెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని పూలతో అలంకరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ సంతోష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో పూడికతీత



ఆత్మకూర్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా డీ 6 కాల్వలో పూడికతీత పనులను చేపడుతున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం మండలంలోని కత్తెపల్లిలో సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి పర్యవేక్షణలో జూరాల ప్రధాన ఎడుమ కాల్వకు అనుసంధానమైన డీ 6 కాల్వలో పూడికతీత, పిచ్చి మొక్కలు తొలగింపు చేపట్టినట్లు తెలిపారు.

కొనసాగుతున్న కంటి వెలుగు


మాచర్లలో కంటి పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యులు


కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీలత

గట్టు: మండలంలోని చమన్‌ఖాన్‌దొడ్డి, మాచర్ల, ఆలూరు గ్రామాలలో కంటి వెలుగు శిబిరాలు కొనసాగుతున్నాయి. బుధవారం మొత్తం మూడు గ్రామాల్లో కలిపి 397 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఇందులో 21 మందికి కంటి అద్దాలను పంపిణీ చేయగా, 29 మందికి కంటి అద్దాల కోసం ప్రతి పాదనలు పంపించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిమ్మప్ప, సాయిచరణ్, సమీరాకౌసర్, హెల్త్ సూపర్‌వైజర్లు స్వర్ణలత, బాలమ్మ, ఏఎన్‌ఎంలు భారతి, కేజీయా, ఈశ్వరమ్మ, ఆయా గ్రామాలకు చెందిన ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవపాడు: ప్రతి ఒక్కరూ కంటి వెలుగు శిబిరాలను వినియోగించుకోవాలని హేమమానస అన్నారు. బుధవారం మండలంలోని మద్దూరులో కంటి వెలుగు కార్యక్రమం 4వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామంలో 141 మందికి కంటి పరీక్షలను నిర్వహించగా, ఆరుగురికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఐదుగురికి కంటి అద్దాల కోసం రిఫర్ చేశారు. కార్యక్రమంలో రాజారామ్, చంద్రన్న, సులోచన, పుష్ప, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని బొంకూరులో కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం సర్పంచ్ శ్రీలత ప్రారంభించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేశామని ఆమె పేర్కొన్నారు. మొదటి రోజు 142 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి


వెంకటేష్‌ను సన్మానిస్తున్న జూరాల గ్రామస్తులు

ఆత్మకూర్: ప్రతి ఒక్కరూ ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని, చట్టాలు అందరికీ సమానమని సమాచార చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎలిగేండ్ల వెంకటేష్‌ముదిరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని జూరాల గ్రామంలో సమాచార హక్కు చట్టం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారి తనం పెంపొందించేందుకు 2005లో కేంద్రప్రభుత్వం సమాచారహక్కు చట్టాన్ని ప్రవేశపెట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో సమాచార చట్టానికి కమిషనర్ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కమిషనర్‌ను నియమించాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల బాధ్యులు రాజు, నర్సింహులు, నిరంజన్, సాయి, నరేందర్, చెన్నప్ప, రాము, శివశంకర్, దశరథ్ తదితరులు ఉన్నారు.

ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ


పండ్లు, బ్రెడ్ అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమరచింత: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న రోగులకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఎంపీటీసీ మాజీ సభ్యుడు మహంకాళీ విష్ణు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జుబేర్‌అహ్మద్ ఆధ్వర్యంలో రోగుల పండ్లు, బ్రెడ్ అందించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎదుగుదల కోసం నిరంతరం శ్రమిస్తున్న పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి సేవా కార్యక్రమాలను మండలంలో విస్తరించేందుకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో మన్సన్, అయ్యూబ్, బడేసాబ్, జాల్గివెంకటేష్, శ్రీధర్, పారుపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ ప్రహరీ నిర్మించాలి


మల్దకల్ ఎస్సీ హాస్టల్‌లో కూలిన ప్రహరీ

మల్దకల్: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌కు ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామానికి దూరంగా వసతి గృహం ఉండటంతో మందుబాబులకు అడ్డాగా మారిందని వాపోయారు. వసతిగృహ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలు ప్రారంభం నాటికి పూర్తి స్థాయి ప్రహరీని నిర్మించాలని అధికారులను వేడుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా ప్రహరీ నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో సవారమ్మ దేవర

మల్దకల్: మండలంలోని తాటికుంటలో సవారమ్మ దేవర ఉత్సవాలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బుధవారం సవారమ్మ ఆలయం వద్ద భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని పూజలు నిర్వహించారు. గ్రామస్తులు, బంధుమిత్రులతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలకు బీజేపీ రాష్ట్ర నాయకుడు గడ్డం కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పెద్దవీరన్న, నాయకులు మధుసూదన్‌రెడ్డి, సత్యారెడ్డి, విక్రంసింహారెడ్డిలు వేర్వేరుగా హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ రాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కేటీదొడ్డి: మండలంలోని గువ్వలదిన్నె గ్రామానికి చెందిన కర్రెప్ప అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గట్టు మండల సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు బాసుహనుమంతు నాయుడు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వారి వెంట వివిధ గ్రామాల సర్పంచ్‌లు గ్రామస్తులు ఉన్నారు.

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ

మానవపాడు: జాతీయ రహదారికి సమీపంలో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ కొన్న ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం ఉండవెల్లి మండలం బైరాపురం గ్రామానికి చెందిన లాల్‌గౌడ్, నాగన్నలు వివిధ పనుల నిమిత్తం అమరవాయి గ్రామానికి వెళ్లారు. పనులు ముగించుకొని తిరుగు ప్రయాణంలో బైక్‌పై వస్తుండగా మండల కేంద్రంలోని శివాలయానికి దగ్గరకు రాగానే బోరవెల్లి గ్రామానికి చెందిన పరుశరాముడు బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో పరుశరాముడికి తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లాల్‌గౌడ్, నాగన్నలను ఆటోలో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎస్ఐ సంతోష్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

పండుగలా దశాబ్ది ఉత్సవాలు

రాజోళి: పండుగలా దశాబ్ది ఉత్సవాలు నిర్వహిద్దామని ఎంపీపీ మరియమ్మ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రం ఏర్పాటు తర్వాత పల్లెల నుంచి పట్టణాల వరకు ఎంతో ప్రగతి సాధించిందన్నారు. మండల కేంద్రంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నతానియేల్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం సాగుకు రైతన్న సన్నద్ధం

అయిజ: వర్షాకాలం సమీపిస్తుండడంతో రైతన్నలు వానాకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. మండలంలో మొత్తం 68,673 ఎకరాల వ్యవసాయం భూములు ఉన్నాయి. ఇందులో 57,637 ఎకరాలు సాగుకు అనుకూలమైన భూమి ఉంది. ఈ ఏడాది వానాకాలంలో సుమారు 50,000 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేసే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రతి సంవత్సరం కంది, ఆముదం, వేరుశనగ, పత్తి తదితర పంటలు సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతారు. ప్రస్తుతం వానాకాలం సాగుకు రైతులు పంటపొలాలను దుక్కిదున్ని, గుంటికలు చేస్తూ చదును చేసుకుంటున్నారు. పొలాల్లో భూముల సారవంతం కోసం పశువుల ఎరువును వేస్తున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఇటీవల కేటీదొడ్డి మండలం ఇర్కిచేడు గ్రామానికి చెందిన రైతు ఆంజనేయులు అనారోగ్యంతో మృతి చెందాడు. రైతుబీమా నుంచి రూ.5 లక్షల చెక్కు మంజూరైంది. ఈ సందర్భంగా బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబసభ్యులకు చెక్కు అందజేశారు. అదేవిధంగా గద్వాల మండలం కొండపల్లికి చెందిన సోమేశ్వరికి మెరుగైన వైద్యం నిమిత్తం రూ.2 లక్షల ఎల్‌వోసీని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, ఎంపీపీ రాజారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ ధరణిషా

మానవపాడు: పౌరహక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ ధరణిషా అన్నారు. బుధవారం మండలంలోని చెన్నిపాడులో పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరూ కుల, మత, వర్గ, విభేదం లేకుండా అందరూ కలిసిమెలిసి జీవించాలన్నారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రజానీకాంత్‌రెడ్డి, సర్పంచ్ వెంకటమ్మ, ఎంపీటీసీ స్వాములు, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ మహ్మద్ హుసేన్, మాజీ ఎంపీటీసీ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి పాలనకు చరమగీతం పాడుదాం


మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

అలంపూర్ రూరల్: అవినీతి పాలనకు చరమగీతం పాడుదామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని శింగవరంలో ఆ పార్టీ పట్టణ, మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. నేటి నుంచి పోలింగ్ బూత్ అధ్యక్షులు, కార్యదర్శులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, గ్రామ పంచాయతీ ఇచ్చే నిధుల గురించి ప్రజలకు వివరించాలన్నారు. జూన్ 30వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ఎడ్యుకేషనల్ సెల్ కన్వీనర్ బంగి లక్ష్మణ్, రవి, వినీత్‌కుమార్, ఈశ్వరయ్య, రంగస్వామి, నరేష్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు కొత్త శోభ


గద్వాల- రాయచూరు రోడ్డు పక్కన..

ధరూరు: రహదారుల వెంట నాటిన చెట్లకు పూసిన పూలతో రోడ్లకు కొత్త కళ సంతరించుకుంది. గద్వాల – రాయచూర్ రహదారికి ఇరువైపుల ఉన్న చెట్లకు ఎర్రని పూలు పూసి వాహనదారుల, ప్రయాణికులకు వీనుల విందు చేస్తున్నాయి. సుబాబుల్ చెట్లకు నిండుగా పూసిన పూలు మనసుకు హాయిని గొలిపే విధంగా దర్శనమిస్తున్నాయి. ప్రయాణికులు చెట్ల వద్దకు వెళ్లి సెల్ఫీలు దిగుతూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మనసుకు ఎంతో హాయిని ఇస్తున్నాయని పలువురు పేర్కొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి


కలెక్టరేట్ ఏఓ యాదగిరికి వినతిపత్రం అందజేస్తున్న నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు

గద్వాల అర్బన్: నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కార్యాలయంలోని ఫర్నిచర్, కారు అద్దాలను ధ్వంసం చేయడంతో పాటు కార్యకర్తలపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టి ఏఓ యాదగిరికి, అనంతరం ఎస్పీ సృజనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడి చేసిన బీఆర్‌ఎస్ నాయకులు, వారి అనుచరులపై చర్యలు తీసుకోవాలని, లేదంటే రాబోయే రోజుల్లో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు బుచ్చిబాబు, లవన్న, రంగస్వామి, వెంకట్రాములు, మునెప్ప, ఆవనిశ్రీ, బలరాం నాయుడు, తదితరులు ఉన్నారు.

చర్యలు తీసుకోవాలని వినతి..

ధరూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డిపై దాడికి చేసిన వారిపై, అందుకు ప్రోత్సాహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రెడ్డి సేవా సమితి నాయకులు బుధవారం కలెక్టరేట్‌లోని ఏఓ యాదిగిరికి వినతిపత్రం అందజేశారు.

రాజకీయంగా ఎదుర్కోలేకనే దాడులు


మాట్లాడుతున్న మహేష్

అలంపూర్: రాజకీయంగా ఎదుర్కోలేకనే బీఆర్‌ఎస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్ అన్నారు. బుధవారం అలంపూర్ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నడిగడ్డ హక్కుల పోరాట సమితి కార్యాలయంపై, గొంగ్లల రంజిత్ కుమార్ ఇంటి వద్దకు వెళ్లి కారును ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పల్లెల్లో బహుజన వాదం బలపడటంతో ఓర్వలేక కుట్రలు చేస్తున్నారన్నారు. ఇలాంటి దాడులు మరోమారు పునరావృతం అయితే ఊరుకోమని హెచ్చరించారు. బహుజనుల కోసం పోరాడే ప్రతి ఒక్కరికి బీఎస్పీ అండగా ఉంటుందన్నారు. గడీల పాలనకు చరమగీతం పాడేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధు గౌడ్, మండలాల అధ్యక్షులు నాగరాజు, వెంకటేశ్వర్లు, లక్ష్మన్న, కరెంట్ రవి, నాయకులు శాంత కుమార్, జలంధర్, మద్దిలేటి తదితరులు ఉన్నారు.